సాక్షి మహబూబ్‌నగర్

సోమవారం : 30 : జనవరి : 2023



పర్యాటకంగా తీర్చిదిద్దుదాం

అలంపూర్ ఆలయాలను పర్యాటకంగా తీర్చిదిద్దుదామని ఎండీ మనోహర్ అన్నారు.

వివరాలు 10లో ▸



ఘనంగా శకటోత్సవం

గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శకటోత్సవం నిర్వహించారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32.5 /17.4

ఉదయం, రాత్రి సమయాల్లో చలి ప్రభావం పెరుగుతుంది. మధ్యాహ్నం పాక్షికంగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

పోలీస్‌స్టేషన్ల తనిఖీ



మహబూబ్‌నగర్ క్రైం: కుటుంబ సమస్యలు, భార్యాభర్తలు గొడవపడి వచ్చిన క్రమంలో అవసరమైన కౌన్సిలింగ్ అందించి, సరైన న్యాయం జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ నర్సింహ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని డీఎస్పీ కార్యాలయం, రూరల్ పోలీస్ స్టేషన్, టూటౌన్, వన్‌టౌన్, మహిళా పోలీస్ స్టేషన్లను ఎస్పీ ఆదివారం తనిఖీ చేశారు. ప్రతి వర్టికల్‌లో సిబ్బంది పని తీరు ఉత్తమంగా ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. అనంతరం పట్టణంలోని యూనిట్ సురక్ష ఆస్పత్రి, స్టోర్, క్వార్టర్స్, మినరల్ వాటరల్ ప్లాంట్లను పరిశీలించారు. గ్యాస్ గోదాంలో ఫైర్ సేఫ్టీ పరికరాలు సక్రమంగా ఉన్నాయా.. లేదా నిత్యం తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ మహేష్, ఇతర పోలీస్ అధికారులు ఉన్నారు.

కొనసాగుతున్న టీచర్ల బదిలీల ప్రక్రియ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్ల బదిలీల ప్రక్రియ కొనసాగుతుంది. శుక్రవారం అర్ధరాత్రి అధికారులు సీనియార్టీ జాబితాను బయటపెట్టడంతో ఈ జాబితాపై ఉపాధ్యాయులు సీనియర్ జూనియర్‌తోపాటు పలు అంశాలను బేరీజు వేసుకుంటున్నారు. అయితే ఇందులో పొరపాట్లు జరిగినట్లు ఉపాధ్యాయ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా డీఎస్సీ సంవత్సరం చేరిన తేదీ సర్వీస్‌లో పది అంశాలు తప్పులు దొరికినట్లు సమాచారం. అయితే సీనియార్టీ జాబితాలో తప్పులు దొర్లడంపై త్వరలోనే అధికారులు ఉపాధ్యాయుల నుంచి అప్పీళ్లు స్వీకరించనున్నట్లు తెలుస్తుంది. ఉపాధ్యాయులు సీనియార్టీ జాబితాలో వచ్చిన తప్పిదాలపై దరఖాస్తు చేసుకుంటే అధికారులు వాటిని సరిదిద్దే అవకాశం ఉంది. అందుకోసం ఉపాధ్యాయులకు ప్రత్యేక తేదీలను ఇవ్వనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రక్రియ ఆదివారం సైతం కొనసాగింది.

కాలుష్యాన్ని కడిగేస్తారా..!

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: జిల్లాలోని జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్ పరిధిలో ఫార్మా పరిశ్రమలు వెదజల్లుతున్న కాలుష్యంపై వారిది అలుపెరగని పోరాటం.. అటు హైదరాబాద్‌లోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఇటు జిల్లాలోని కలెక్టరేట్‌కు వారం వారం చక్కర్లే.. కలవని నేతలు లేరు.. అధికారులు లేరు.. చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను సైతం ఆశ్రయించారు.. ఇలా న్యాయం కోసం ఎక్కని గడప లేదు.. దిగని మెట్లు లేవు.. అయినా కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించక రైతాంగం బాధలు తీరడం లేదు. ఈ క్రమంలో బాధితుల పక్షాన 'సాక్షి' సమరశంఖం పూరించింది. ఆధారాలతో సహా ప్రచురించిన వరుస కథనాలు సంచలనం సృష్టించగా.. పీసీబీతోపాటు జిల్లా అధికార యంత్రాంగం ఉక్కిరిబిక్కిరి అయ్యింది. వీటిపై స్పందించిన కలెక్టర్ వెంకట్రావ్ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సంయుక్త విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు ఎంక్వైరీ నివేదిక ఆయనకు అందగా.. చర్యలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి కలెక్టర్ ఫైనల్‌గా మంగళవారం విచారణ అధికారులతో భేటీ కానున్నట్లు తెలిసింది. ఇందులోనే తాను తీసుకునే చర్యలను ప్రకటించనున్నట్లు సమాచారం. అయితే కాలుష్యాన్ని విరజిమ్ముతున్న కంపెనీలపై కొరడా ఝుళిపిస్తారా..? ఎప్పటిలాగే పీసీబీ తరహాలో మమ అనిపిస్తారా..? అని బాధిత రైతులు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

రేపు 'పోలేపల్లి' పరిశ్రమల పొల్యూషన్‌పై తుది నిర్ణయం

- విచారణ అధికారులతో భేటీ కానున్న కలెక్టర్
- ఇప్పటికే సంయుక్త నివేదిక అందజేసిన ఎంక్వైరీ కమిటీ
- కొరడా ఝుళిపిస్తారా.. మమ అనిపిస్తారా.. అని అనుమానాలు వ్యక్తం చేస్తున్న రైతులు
- ఎన్జీటీ పరిహారం అందజేతపై ఆశలు



'సాక్షి'లో ప్రచురితమైన కథనాలు

ఇబ్బందులు పడుతున్నాం...



పరిశ్రమలు రాకముందు మా భూముల్లో పంటలు పండించుకుని కుటుంబాలను పోషించుకునేవాళ్లం. పనికిమాలిన పరిశ్రమలు వచ్చిన తర్వాత కాలుష్య జలాలు మా భూముల్లోకి వదలడంతో భూసారం దెబ్బతిని పంటలు పండక ఇబ్బందులు పడుతున్నాం. మా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. చివరికి మాకు చావే శరణ్యం అయ్యేలా ఉంది.

– పాలెం విఠలయ్యగౌడ్, రైతు, రాయపల్లి

ఎన్జీటీలో మళ్లీ కేసు వేస్తా..



ఇప్పటి వరకు మా గ్రామ శివారులోని వ్యవసాయ బోర్లు, పంచాయతీ తాగునీటి బోర్లు పరిశ్రమలు వదిలిన కాలుష్యం కారణంగా కలుషితమయ్యాయి. గ్రామ శివారులో ఉన్న పల్లె చెరువు కూడా కలిషిత నీటితో నిండిపోయింది. కాలుష్యం వదిలిని పరిశ్రమలపై ఎన్జీటీలో మళ్లీ ఫిర్యాదు చేస్తా. కలెక్టర్‌కు కూడా మా గ్రామస్తులు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా.. ఫలితం లేకపోయింది.

– కావలి పెంటయ్య, సర్పంచ్, ముదిరెడ్డిపల్లి

ఆరు నెలలుగా సాగిన విచారణ..

పోలేపల్లి సెజ్‌లో ప్రధానంగా ఫార్మా పరిశ్రమల నుంచి బయటకు విడుదల చేస్తున్న వ్యర్థ నీటితో భూగర్భజలాలు, కుంటలు, చెరువులు కలుషితం కావడం.. పంటలు పండకపోవడం.. స్థానికులు రోగాల బారిన పడుతుండడంపై గతేడాది జూలైన 23న 'సాక్షి'లో 'పల్లె చెరువు, గుండ్లగడ్డలో గరళం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఆ తర్వాత 'ముందుగా లీక్.. ఆ తర్వాతే రాక', 'ఆ పరిశ్రమలపైనే కృప' శీర్షికలతో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన కలెక్టర్ మొదట నలుగురు అధికారులతో విచారణకు ఆదేశించినా.. జాప్యం చోటుచేసుకుంది. ఈ క్రమంలో 'సారూ.. సాక్ష్యాలివిగో' అని ఆధారాలు చూపుతూ 'విషజలం.. బతుకులు దుర్భరం' శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితం కాగా.. కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. సెజ్ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న కాలుష్య పరిస్థితులపై పూర్తి స్థాయిలో విచారణకు రెవెన్యూ, వ్యవసాయ, పీసీబీ, సాగునీటి పారుదల, వైద్య, ఆరోగ్య, భూగర్భ జల, పరిశ్రమలు, టీఎస్‌ఐఐసీ జిల్లా అధికారులతో కమిటీని నియమించారు. ఆ తర్వాత అదనపు కలెక్టర్ సీతారామారావు ఆధ్వర్యంలో నవంబర్ 5న పరిశ్రమల ప్రతినిధులు, బాధితులతో విచారణ చేపట్టారు. నిర్దేశిత గడువు నవంబర్ 8న విచారణ నివేదిక అందాల్సి ఉన్నప్పటికీ.. అనేక అవాంతరాలతో జాప్యం జరిగింది. ఎట్టకేలకు విచారణ పూర్తి కాగా.. మంగళవారం విచారణ బృందంలోని ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ భేటీ కానున్నారు. అయితే విచారణలో జాప్యం చోటుచేసుకోవడంపై కాలుష్య బాధితులు, పరిశ్రమల పరిధిలోని గ్రామాల ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆ పరిశ్రమలకే మేలు చేసేలా రిపోర్టులు తారుమారు చేశారని.. పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎన్జీటీ పరిహారంపై..

పోలేపల్లి సెజ్‌లో కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలపై 2017లో ఎన్జీటీలో కేసు నమోదైంది. విచారణ అనంతరం 2021లో పంటలు నష్టపోతున్న రైతులకు 11 కంపెనీలు నష్టపరిహారం అందించాలని తీర్పు ఇచ్చింది. ఒక్కో కంపెనీకి రూ.18,25,000 జరిమానా విధించింది. ఈ మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు ఆయా ఫ్యాక్టరీల నుంచి డబ్బులు వసూలు చేసి పీసీబీ ఖాతాలో జమ చేశాయి. కానీ, నష్ట పరిహారాన్ని రైతులకు ఇవ్వలేదు. దీనిపై పీసీబీతో పాటు కలెక్టర్‌కు రైతులు పలు పర్యాయాలు ఫిర్యాదు చేశారు. విచారణ సందర్భంగా నేరుగా కలెక్టర్‌కు సైతం విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఈ అంశంపైనా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తారనే ఆశలో బాధిత రైతులు ఉన్నారు. కాలుష్య జలాలతో పంటలు పండడం లేదని.. ఏటా నష్టాలే వస్తున్నాయని.. కనీసం పరిహారం అందించి ఆదుకోవాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా, విచారణ కమిటీలోని అధికారులతో భేటీ అనంతరం కలెక్టర్ తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ఆ తర్వాత రికార్డులను పీసీబీతోపాటు ఎన్జీటీకి సైతం అందజేయనున్నట్లు తెలిసింది.

ఉద్యోగుల హక్కుల కోసం ఏకమవుదాం



నియోజకవర్గ కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న నరేందర్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): హక్కుల కోసం నాలుగో తరగతి ఉద్యోగులంతా ఏకమవుదామని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. ఆదివారం కలెక్టర్ బంగ్లా చౌరస్తాలోని సంఘం కార్యాలయంలో జిల్లా, నియోజకవర్గాల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులకు ఏమైనా సమస్యలు ఉంటే సంఘం దృష్టికి తెచ్చి ప్రభుత్వంతో సాధించుకుందామన్నారు. ఉద్యోగులు ఒక్కతాటిపైకి వచ్చి పోరాడితే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. అనంతరం జిల్లాలోని మూడు నియోజకవర్గాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నరేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా భాగ్యలక్ష్మి, వేణుగోపాల్, కార్యదర్శిగా నర్సింహులు, జడ్చర్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా అశోక్, గౌరవాధ్యక్షుడిగా యాదయ్య, ఉపాధ్యక్షులుగా రామాంజనేయులు, బాలప్ప, కార్యదర్శిగా నర్సింహులు, దేవరకద్ర నియోజకవర్గ అధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, అలీమొద్దీన్, కార్యదర్శిగా శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. ఈ నెల 31న హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో జిల్లా కమిటీని ఎన్నుకోనున్నట్లు చెప్పారు.

మన్యంకొండకు పోటెత్తిన భక్తులు



స్వామివారికి హారతి ఇస్తున్న ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి రథసప్తమి వేడుకలను పురస్కరించుకొని భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామివారు సూర్యప్రభ వాహనసేపై ఆలయ పురవీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు. ఆలయంలోని లక్ష్మీ విలాసంలో హనుమద్దాసుల వారి సంకీర్తనలు పుల్లాఖండం ఉపేంద్రస్వామిచే ప్రవచనాలు, శ్రీనివాస్ యాదవ్ బృందం హనుమద్దాసుల వారి కీర్తనలను ఆలపించారు. భక్తులకు సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బాలమణి, ఉపాధ్యక్షురాలు సువర్ణ, కార్యదర్శి భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ఆరుతడిపై అనాసక్తి

- వరిసాగుకే మొగ్గుచూపుతున్న జిల్లా రైతాంగం
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నా ఫలితం శూన్యం
- మరో పదిరోజుల వరకు పంటల సాగుకు అనుకూలం
- 14 వేల ఎకరాలకే పరిమితమైన వాణిజ్య పంటలు
- ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న అధికారులు



మహబూబ్‌నగర్ రూరల్ మండలం అప్పాయిపల్లి శివారులో సాగుచేసిన వరిపంట

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లా రైతాంగం ఆరుతడి పంటలపై ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వం, జిల్లా వ్యవసాయశాఖ యాసంగిలో ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నా.. ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలని సూచిస్తున్నా.. రైతులు మాత్రం వరిసాగుకే మొగ్గు చూపుతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు గడించే ఆరుతడి పంటలు సాగు చేయడం వల్ల రైతులకు లాభాలు చేకూరే అవకాశం ఉంటుంది. వేరుశనగ, ఆముదం, మినుములు, మొక్కజొన్న, శెనగ, జొన్న, నువ్వులు పంటలు వేయడం వల్ల ఎరువులు, నీటి వినియోగం తగ్గుతుందని సూచిస్తున్నారు. భూసారం పెరగడంతో పాటు మిశ్రమ పంటలు సాగు చేసుకునే వెసులుబాటు ఆరుతడి పంటలతో లభిస్తుంది.

క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ

ప్రభుత్వ ఆదేశాల మేరకు యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రైతుల వారీగా ఏ సర్వే నంబర్‌లో ఏ పంట ఎంత విస్తీర్ణం, విత్తన రకం, ప్రధాన అంతర పంట, నీటి వసతి వివరాలను నమోదు చేయడంతోపాటు రైతుల సంతకాలను సేకరిస్తున్నారు. గ్రామాల్లో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పర్యటిస్తూ రైతుల వారీగా సాగు విస్తీర్ణం వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. రైతులు పండించే పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో కొనుగోలు విషయంలో సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. రైతులు సాగు చేస్తున్న పంటల ద్వారా రానున్న దిగుబడి వివరాలను అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 64,262.67 ఎకరాల్లో పంటలు సాగు కాగా.. 30,612.17 ఎకరాల్లోని పంటలు ఆన్‌లైన్‌లో నమోదైనట్లు అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతం జిల్లాలో మొత్తం 1,63,500 ఎకరాలలో పంటలు సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేయగా.. ఇప్పటికే 50,166 ఎకరాల విస్తీర్ణంలో వరి నాట్లు పూర్తయ్యాయి. ఆరుతడి పంటలు విత్తడం కొనసాగుతోంది. మరో పదిరోజుల వరకు వరి సాగుకు అనుకూలమని అధికారులు అంచనా వేస్తున్నారు.



మహబూబ్‌నగర్ రూరల్ మండలం అంబట్‌పల్లిలో పంట వివరాలు సేకరిస్తున్న ఏఓ శ్యాంయాదవ్

గణనీయంగా పెరుగుదల..

జిల్లాలో ఆరుతడి పంటల సేద్యం నామమాత్రమైంది. యాసంగిలో ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు వెళ్లాలని ప్రభుత్వం సూచిస్తున్నా రైతులు ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో వరిసాగు గణనీయంగా పెరుగుతుంటే మొక్కజొన్న, వేరుశనగ, పప్పు పంటల సాగు తగ్గుతూ వస్తోంది. ప్రణాళిక ప్రకారం వరి సాగును తగ్గించుకుంటూ వాటి స్థానంలో ఆరుతడితోపాటు ఉద్యానవన పంటల సాగు చేయాలని సూచనలు చేస్తున్నా రైతులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం జిల్లాలో 14,102 ఎకరాల్లో వరి కాకుండా మిగతా ఆరుతడి పంటలు సాగవుతున్నాయి.

దిగుబడి ఉండదు..



వరి కొయ్యల్లో మిగతా ఆరుతడి పంటలు ఏవి వేసినా దిగుబడి ఆశాజనకంగా ఉండదు. అవసరమైతే పొలాన్ని బీడు అయినా పెడతామే.. కానీ ఆరుతడి పంటలు మాత్రం వేయం. అదే జొన్న, కంది, పత్తి పంటల తనదనంతరం ఆరుతడి పంటలు సాగు చేస్తే దిగుబడి కూడా బాగుంటుంది. వర్షాకాలంలో వరిపంట సాగు చేయడం వల్ల తిరిగి నాకున్న సొంత పొలంతో పాటు కౌలుకు తీసుకున్న పొలంతో కలిపి 15 ఎకరాల్లో వరినాటు పెట్టా.

– వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు, మాచన్‌పల్లి, మహబూబ్‌నగర్ రూరల్

పక్కాగా నమోదు..



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు యాసంగి సీజన్‌లో సాగు చేస్తున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ఏ సర్వే నంబర్‌లో ఏ పంట ఎంత విస్తీర్ణంలో వేశారో వివరాలను సేకరిస్తున్నాం. సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పంటల వివరాల ఆధారంగానే దిగుబడులు అమ్ముకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

– వెంకటేష్, జిల్లా వ్యవసాయాధికారి

యాసంగి సాగు అంచనా	ఇప్పటి వరకు సాగైంది	ఇందులో వరిసాగు విస్తీర్ణం	ఆరుతడి పంటలు	ఆన్‌లైన్‌లో నమోదైన వివరాలు
1,63,500 ఎకరాలు	64,262 ఎకరాలు	50,166 ఎకరాలు	14,102 ఎకరాలు	30,612 ఎకరాలు

1న విష్ణుసహస్రనామ స్తోత్ర కంఠస్థ పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం- హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లాశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాకేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు శ్రీవిష్ణు సహస్రనామ, స్తోత్ర పారాయణం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లాశాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10- 15 ఏళ్లలోపు విద్యార్థులకు శ్రీవిష్ణుసహస్రనామ పారాయణంపై, పదేళ్లలోపు విద్యార్థులకు అచ్యుతాష్టకంపై కంఠస్థ పోటీలు ఉంటాయన్నారు. ఈ రెండు విభాగాల్లో ప్రతిభచాటిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేవారు పూర్తి వివరాల కోసం సెల్ నం.93475 40005ను సంప్రదించాలని ఆయన కోరారు.

నాగరికత నేర్పిన వృత్తులను ఆదరిద్దాం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): నాగరికత నేర్పిన వృత్తులను ఆదరిస్తూ.. కులవృత్తులకు అండగా నిలవాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కుమ్మరుల ఆత్మీయ సమ్మేళన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సారె తిప్పి కుండల తయారీ చేశారు. అనంతరం కుమ్మరులు కళాత్మకంగా తయారు చేసిన మట్టి పాత్రలను పరిశీలించి.. కుమ్మరుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రభుత్వం కుల వృత్తిదారుల అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కులవృత్తులు అంతరించిపోతున్నాయని, వాటికి అందరూ అండగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. గుర్తింపు ఉన్న కులాలన్నింటికీ రాజధానిలో ఆత్మగౌరవ భోనాల కోసం రూ.కోట్ల విలువైన స్థలాలు, నిధులను అందజేశామన్నారు. జిల్లాకేంద్రంలోని శిల్పారామం వద్ద కులవృత్తుల వారి కోసం ప్రత్యేకంగా స్టాల్స్ కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ గణేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కేవీ జిల్లా అధ్యక్షుడు కృష్ణమోహన్, కుమ్మర సంక్షేమ సంఘం నాయకులు జయంత్‌రావు, దయానంద్, బుగ్గన్న, ఎల్లప్ప, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.







క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు, మోటార్ సైకిల్ ఢీ

- ముగ్గురికి గాయాలు, 9నెలల పాప పరిస్థితి విషమం

భూత్పూర్: పట్టణంలోని జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఆర్టీసీ అద్దె బస్సు, మోటార్ సైకిల్ ఢీకొంది. ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. 9 నెలల చిన్నారి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు, వాహనదారుల కథనం ప్రకారం.. గద్వాల డిపోకు చెందిన ఆర్టీసీ అద్దెబస్సు (టీఎస్33 టీ 3399) హైదరాబాద్ నుంచి గద్వాల వెళ్తూ భూత్పూర్ వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. దీంతో మోటార్ సైకిల్‌పై వస్తున్న మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన బ్రహ్మయ్య, భార్య పూజ, తల్లి నాగమ్మ గాయపడ్డారు. బ్రహ్మయ్య కూతురు(9నెలలు) ప్రసన్నకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పంచవటి హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించారు. బ్రహ్మయ్యతో పాటు భార్య పూజ, తల్లి నాగమ్మను ఎల్అండ్‌టీ, 108 వాహనంలో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై భూత్పూర్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానికులు, వాహనదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

రెండు పోక్సో కేసులు నమోదు

గద్వాల క్రైం: గద్వాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రెండు ఫోక్సో కేసులు నమోదైనట్లు పట్టణ రెండో ఎస్ఐ అబ్దుల్‌షుకుర్ తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్టల్ ఉంటూ పాఠశాల విద్యను అభ్యసిస్తున్న మైనార్ విద్యార్థినితో హాస్టల్ నిర్వాహకులైన బంధువు (మైనర్ యువకుడు) చనువుగా ఉంటూ అత్యాచారానికి పాల్పడాడ్డు. ఈ విషయాన్ని విద్యార్థిని తన తల్లి తెలియజేసింది. కూలి పనుల నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్న సదరు తల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. యువకుడిని అదుపులోకి తీసుకుని ఫోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు. హాస్టల్ నిర్వాహకుడిపై సైతం విచారించి కేసులు నమోదు చేస్తామన్నారు.

యువకుడిపై...
గద్వాల పట్టణంలోని ఇంటర్ చదువుతున్న ఓ యువకుడు విద్యార్థినికి పరిచయమయ్యాడు. ఇద్దరు తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఈ స్నేహంతో వారు వాట్సప్ కాల్స్ ద్వారా వీడియో కాల్‌లో మాట్లాడుకునేవారు. అయితే వారి మధ్య తరచూ వీడియో కాల్ ద్వారా మాట్లాడాలని విద్యార్థినిని యువకుడు ఒత్తిడి చేసేవాడు. అయితే తను నిరాకరించగా.. తనతో వాట్సప్ కాల్స్ ద్వారా మాట్లాడే క్రమంలో స్క్రీన్ షార్టు తీసిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తానని బెదిరింపులకు పాల్పడాడ్డు. ఆందోళన చెందిన విద్యార్థిని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. దీంతో కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. యువకుడిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ రెండో ఎస్ఐ తెలిపారు.

కలుషిత నీరు తాగి 80 గొర్రెలు మృతి

అడ్డాకుల: మూసాపేట మండలంలోని మహ్మదుస్సేన్‌పల్లికి చెందిన కాపరుల గొర్రెలు కలుషిత నీరు తాగి మృతిచెందినట్లు కాపరులు తెలిపారు. గ్రామానికి చెందిన గొల్ల హనుమప్ప, ఎర్ర మల్లయ్య, గొల్ల రాములు, మల్లయ్యలకు చెందిన గొర్రెలను కొన్నాళ్ల కిందట సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు మేత కోసం తీసుకెళ్లారు. ఈ క్రమంలో ఆదివారం సదాశివపేట మండలం నందికండికి సమీపంలో కాపరులు గొర్రెలను మేపుతున్నారు. ఇక్కడికి దగ్గరలోని ఓ ఆగ్రో కంపెనీ సమీపంలో నిలిచిన కలుషిత నీటిని కొన్ని గొర్రెలు తాగాయి. కొద్దిసేపటి తర్వాత అవి అక్కడికక్కడే కుప్పకూలి చనిపోయాయి. నలుగురు కాపరులకు చెందిన సుమారు 80 గొర్రెలు చనిపోయినట్లు మహ్మదుస్సేన్‌పల్లి సర్పంచ్ నిర్మల కాశీనాథ్ తెలిపారు. గొర్రెలు చనిపోయిన కాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మళ్లీ గుప్పుమంటోంది..

గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న సారా తయారీ

- గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు
- తెల్లబెల్లం, చక్కెరతో తయారుచేస్తున్న వైనం
- అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో..
- గత ఏడాది ఉమ్మడి జిల్లాలో 1,497 కేసులు నమోదు



కల్వకుర్తి జేపీనగర్ తండాలో సారాను సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: కొన్నేళ్లుగా స్తబ్దుగా ఉన్న సారా తయారీ మళ్లీ పుంజుకుంటోంది. కొన్ని మారుమూల ప్రాంతాలు, తండాల్లో గుడుంబా మళ్లీ గుప్పుమంటోంది. ఓవైపు ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ అధికారులు సారా తయారీ కట్టడి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నా కొన్ని ఏరియాల్లో జోరుగా ఈ వ్యాపారం కొనసాగుతోంది. గుడుంబాను తరిమేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన తర్వాత ఇందుకు అనుగుణంగా తయారీ, విక్రయాలను నియంత్రించేందుకు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అనేక చర్యలు చేపట్టింది. దశలవారీగా దాడులు నిర్వహించింది. ముడి పదార్థాలైన బెల్లం, పటిక, తదితరాల అమ్మకాలపై ఆంక్షలు విధించింది. పునరావాస పథకం కింద రాయితీ రుణాలను పంపిణీ చేసింది. ప్రత్యామ్నాయ ఉపాధి చూపించింది. అయినా కొన్ని ప్రాంతాల్లో గుడుంబా గుప్పుమంటోంది.

పొలాలు, కొండ ప్రాంతాలే అడ్డా..
ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం నమోదవుతున్న లెక్కల ప్రకారం చూస్తే మొదటి స్థానంలో నాగర్‌కర్నూల్ ఉండగా రెండవ స్థానంలో వనపర్తి ఆ తర్వాత మహబూబ్‌నగర్ జిల్లాలు ఉన్నాయి. ప్రధానంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో సారా తయారీ, విక్రయాలు అధికంగా ఉన్నాయి. దీంట్లో కూడా అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి, తెల్కపల్లి మండల పరిధిలో ఉండే గ్రామాలు, తండాల శివారు ప్రాంతాల్లో వ్యవసాయ పొలాల్లో, కొండ ప్రాంతాల్లో అక్రమంగా బట్టీలు ఏర్పాటు చేసి బెల్లంతో ఇప్పపువ్వుతో సారాను తయారు చేస్తున్నారు. ఇక వనపర్తి మండల కేంద్రంతో పాటు మహబూబ్‌నగర్ మండలంతో పాటు నవాబుపేట, కొయిలకొండ, హన్వాడ, జడ్చర్ల ప్రాంతాల్లోని పల్లెల్లో, సమీప తండాల్లో గుడుంబా తయారీ కొనసాగుతుంది. ఒకవైపు ఎక్సైజ్ అధికారులు దాడులు జరుపుతున్నా గుడుంబా తయారీ విధానం పూర్తిగా ఆగడం లేదు. ముఖ్యంగా నవాబుపేట, మహబూబ్‌నగర్ మండల పరిధిలోని కొన్ని తండాల్లో జోరుగా తయారు చేస్తున్నారు. గుడుంబా తయారు చేస్తున్న వారు నల్లబెల్లం కొరత ఉండటంతో తెల్లబెల్లం, చక్కెరను వాడుతున్నట్లు ఎక్సైజ్ అధికారుల దాడుల్లో వెలుగులోకి వచ్చింది.



పదరలో బెల్లం పానకం పారబోస్తూ..

అవగాహన కార్యక్రమాలు
ఆబ్కారీ శాఖ అధికారులు సారా నియంత్రించడానికి గ్రామాల్లో, తండాల్లో నివసించే ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. గతంలో ఎక్సైజ్ అధికారులు కేవలం సారాను అదుపుచేయడానికి వాటిని విక్రయించే వారిని అదుపులోకి తీసుకునే వారు. కానీ ఇప్పుడు అలా కాకుండా ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు.

> **నియంత్రణకు యాక్షన్ ప్లాన్**
>
> నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తి, తెల్కపల్లి, కొల్లాపూర్ ఏరియాల్లో సారా తయారు చేస్తున్నట్లు గుర్తించాం. వనపర్తి స్టేషన్ పరిధిలో కూడా కొంత ఉంది. ఇలాంటి ఏరియాలను డి–క్యాటగిరీ కిందకు చేర్చాం. సారా నియంత్రించడానికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ తయారు చేయడంతో పాటు బృందాలను తయారు చేశాం. ఆయా ప్రాంతాల్లో తనిఖీలు, దాడులు పెంచి కట్టడి చేస్తాం. గత ఏడాది దాదాపు 350వాహనాలు సీజ్ చేశాం. ఇతర రాష్ట్రాల నుంచి ముడిసరుకు రాకుండా చర్యలు చేపడుతున్నాం.
>
> – దత్తరాజ్‌గౌడ్, ఉమ్మడి జిల్లా ఎక్సైజ్‌శాఖ డీసీ

2022 జనవరి - డిసెంబర్ వరకు నమోదైన కేసుల వివరాలిలా..

జిల్లా	సారా కేసులు	అరెస్టులు	పట్టుబడిన		
			సారా (లీటర్లు)	బెల్లం (కేజీలు)	వాహనాలు
మహబూబ్‌నగర్/పేట	314	347	899	2,611	31
నాగర్‌కర్నూల్	853	972	5,182	1,06,818	263
గద్వాల	31	33	75	0	4
వనపర్తి	299	316	1,197	4,613	40

అనన్యశ్రీ.. అసమాన ప్రతిభ

- వాలీబాల్‌లో రాణిస్తున్న మక్తల్ యువతి
- కేరళలోని ఖేలో ఇండియా అకాడమీలో ప్రత్యేక శిక్షణ
- ప్రతిష్టాత్మకమైన 71వ మహిళా సీనియర్ నేషనల్ పోటీలకు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాలోని మక్తల్ పట్టణానికి చెందిన అనన్యశ్రీ వాలీబాల్ క్రీడలో అసమాన ప్రతిభ కనబరుస్తోంది. తల్లిదండ్రులు ఆనంద్, వరలక్ష్మిల ప్రోత్సాహం, కోచ్‌ల శిక్షణలో వాలీబాల్‌లో రాణిస్తుంది. వాలీబాల్‌లో ప్రతిభ చాటి 2019లో ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా అథ్లెట్ పథకం కింద కేరళలోని పట్టణమిట్టలోగల వాలీబాల్ అకాడమీకి ఎంపికై శిక్షణ తీసుకుంటుంది. 2018లో అప్పటి కలెక్టర్ సహకారంతో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో పొడగరి బాలికల క్రీడా నైపుణ్య కార్యక్రమం నిర్వహించగా 180 సెంటీమీటర్లు ఎత్తు ఉన్న అనన్యశ్రీ ఎంపికైంది. అనంతరం సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన వాలీబాల్ అకాడమీ ప్రవేశ సెలక్షన్స్‌లో ప్రతిభకనబరిచి ఎంపికైంది. సరూర్‌నగర్ వాలీబాల్ అకాడమీ తరఫున అనన్యశ్రీ 2018 పంజాబ్ (చండీఘర్)లో జరిగిన జూనియర్ నేషనల్ వాలీబాల్ టోర్నీలో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించింది. 2019 డిసెంబర్‌లో తమిళనాడు రాష్ట్రం ధర్మపురి, 2020 జనవరిలో కడపలో జరిగిన జూనియర్ నేషనల్ వాలీబాల్ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది.

మూడుసార్లు కేరళ జట్టుకు ప్రాతినిధ్యం
అనన్యశ్రీ మూడుసార్లు కేరళ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించడం విశేషం. దేశంలోనే క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చే కేరళ రాష్ట్రంలో సెలక్షన్స్‌లో పోటీ ఎక్కువగా ఉన్నప్పటికీ తన ప్రతిభతో ఆ రాష్ట్ర జట్టుకు ఎంపికై సంచలనం సృష్టించింది. గతేడాది ఏప్రిల్‌లో 23వ జాతీయస్థాయి యూత్ ఉత్తరాఖండ్ రాష్ట్రం రుద్రాపూర్, మేలో మహారాష్ట్ర సాంగ్లి జిల్లా ఇస్లాంపూర్‌లో జరిగిన 24వ జాతీయస్థాయి యూత్ వాలీబాల్ పోటీలకు కేరళ జట్టు తరఫున ఆడింది. ఈ రెండు టోర్నీల్లో కేరళ జట్టు రన్నరప్‌గా నిలిచింది. కేరళలో జరిగిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీల్లోనూ పాల్గొంది. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగిన సీనియర్ లీగ్ (హరియంట్ చసాక్) వాలీబాల్ టోర్నమెంట్‌లో కేరళ జట్టు విన్నర్‌గా నిలిచింది.



మ్యాచ్‌లో బాల్‌ను బ్లాక్ చేస్తున్న అనన్యశ్రీ

సీనియర్ నేషనల్‌కు ఎంపిక
వాలీబాల్‌లో ఎంతో ప్రతిష్టాత్మకమైన సీనియర్ నేషనల్ పోటీలకు అనన్యశ్రీ ఎంపికైంది. అస్సాం రాష్ట్రం గౌహతిలో వచ్చే నెల 2 నుంచి 9 వరకు జరిగే 71వ మహిళా సీనియర్ నేషనల్ వాలీబాల్ పోటీలకు అనన్యశ్రీ కేరళ రాష్ట్ర జట్టు తరఫున ఆడనుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ అమ్మాయి వాలీబాల్‌లో ప్రతిభచాటి కేరళ రాష్ట్రం నుంచి సీనియర్ నేషనల్ పోటీలకు ఎంపికకావడం ఎంతో విశేషం.

> **అంతర్జాతీయ పోటీల్లో ఆడాలన్నదే లక్ష్యం**
>
> 
>
> అంతర్జాతీయ స్థాయిలో వాలీబాల్ పోటీల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే నా లక్ష్యం. ఖేలో ఇండియా కేరళ వాలీబాల్ అకాడమీలో అవకాశం వస్తుందని ఊహించలేదు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిరంతరం ప్రాక్టీస్ చేస్తున్న.
>
> – అనన్యశ్రీ, వాలీబాల్ క్రీడాకారిణి

షార్ట్‌సర్క్యూట్‌తో కిరాణ షాపు దగ్ధం



కిరాణా షాపులో దగ్ధమైన వస్తువులు..

రాజాపూర్: షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా షాపు దగ్ధమైన ఘటన మండలంలోని గుండ్లపొట్లపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన అంజనేయులు కిరాణ దుకాణంలో ఉదయం 11గంటలకు షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు దుకాణం అంతా విస్తరించడంతో అందులో ఉన్న టీవీ, ఫ్రిజ్, ఇతర కిరాణ వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పారు. ఈ ఘటనలో రూ.1.50లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించినట్లు సర్పంచ్ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



మెడవిరుపు తెగులు ఆశించిన వరి పంట

అలంపూర్: పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సస్యరక్షణ చర్యలు చేపట్టడం ఎంతో ముఖ్యం. ప్రస్తుత వాతవరణ పరిస్థితుల్లో చీడపీడల వ్యాప్తి అధికంగా ఉంటుంది. రైతులు ముందస్తుగా సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ, వరిలో మెడవిరుపు తెగుళ్ల ఆశిస్తున్నట్లు తెలిపారు. సాగులో మెళకువలు, తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు..
మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మొలక దశ నుంచి కొంత ఏపుగా పెరగడంతో ముందస్తు జాగ్రత్తలు పాటిస్తేనే ఆశించిన దిగుబడి సాధించవచ్చు.

నివారణ..
కత్తెర పురుగు ఆశించిన పంటకు ముందుగా వేపనునె 1,500 పీపీఎంలను 5లీటర్ల నీటికి క్లోరిఫైరిఫాస్ 50 మి.లీతో కలిపి పిచికారీ చేసుకోవాలి. తర్వాత థయోమిథాక్స్‌మ్ 12.6 శాతం, లామ్డాసైహలోత్రిన్ 9.5శాతం, ఎస్‌సీ 0.5మి.లీ లేదా క్లోరాన్ త్రనోలిపోల్ 18.5శాతం ఎస్‌సీ 0.4 మి.లీ లేదా స్పైనోటోరమ్ 11.7శాతం, ఎస్‌సీ 0.5 మి.లీ లీటర్ నీటికి మందులను మార్చి, మార్చి పిచికారీ చేసుకోవాలి. ఎకరాకు 8చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవడంతో పురుగు ఉధృతి నివారణకు అవకాశం ఉంటుంది.

> **వరిలో మెడవిరుపు..**
>
> వరిలో మెడవిరుపు తెగుళ్ల ఆశిస్తుంది. జిల్లాలో సాగు చేసిన వరిలో ఈ తెగుళ్ల ఆశించినట్లు పేర్కొన్నారు. మరో 15 రోజుల్లో కోతకు వచ్చే సమయంలో ఈ తెగుళ్ల రైతులకు నష్టాలకు గురిచేస్తోంది. తెగులు ఆశించడం వల్ల కంకి కింద నల్లటి లేదా ఎర్రటి మచ్చలు ఏర్పడి కంకి కిందికి వాలుతుంది. రైతులు నివారణ చర్యలు చేపట్టకపోతే తీవ్ర రూపం దాల్చుతుంది.
>
> **నివారణ..**
> వరిలో మెడవిరుపు నివారణకు చర్యలు చేపట్టాలి. దీని కోసం ట్రైసైక్లోజోల్ అనే శిలీంధ్ర నాశినిని 0.3 గ్రాములు లీటర్ నీటికి కలిపి కంకి కింద బాగా తడిచే విధంగా పిచికారీ చేసుకోవాలి.

మృతదేహం లభ్యం..

బల్మూర్: మండలంలోని పొలిశెట్టిపల్లి స్టేజీ వద్ద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి (42) మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ శివానందంగౌడ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఆదివారం గ్రామపంచాయతీ సిబ్బంది హరితహారం మొక్కలకు నీరు పడుతుండగా చాక్లెట్‌రంగు చొక్కా ధరించిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. వెంటనే వారు గ్రామ కార్యదర్శి ధన్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ఆస్పత్రికి తరలించామని వివరించారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్ పాటించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు

గద్వాల న్యూటౌన్: గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రోస్టర్ మెరిట్ ఆధారంగా లిస్టులను రూపొందించాలని బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బీసీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు అన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పండిట్, పీఈటీ పోస్టుల న్నింటినీ అప్‌గ్రేడేషన్స్ కోసం షెడ్యూల్ ప్రకటించాలని చెప్పారు. ప్రాథమిక పాఠశాలలో హెడ్‌మాస్టర్ పోస్టులకు కూడా ప్రమోషన్స్ కోసం షెడ్యూల్ ప్రకటించాలన్నారు. 317 బాధితులందరికి జీరో సర్వీసు ద్వార వారికి బదిలీ అవకాశాన్ని కల్పించాలలని, మార్చిలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీటీఏ బలపర్చిన అభ్యర్థి డాక్టర్ విజయ్‌కుమార్‌ను మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, కృష్ణయ్య, శ్రీధర్, నాగరాజు, ధనుంజయ్య, రాంచంద్రయ్య, చంద్రన్న, నర్సింహులు పాల్గొన్నారు.

'పేట'కు సాగునీరు అందించాలి



మాట్లాడుతున్న యాదగిరి

నారాయణపేట టౌన్: జిల్లాలోని వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో ఏఐపీకేఎస్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకం జీఓ నంబర్ 69 ద్వారా జిల్లాలో వ్యవసాయానికి సాగునీరు అందించాలన్నారు. రైతులు పండించిన అన్నిరకాల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా మద్దతు ధరలు నిర్ణయించాలని, పత్తి క్వింటాల్ రూ.12వేలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ధరణి పోర్టల్‌లో రైతు భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రైతాంగానికి వ్యవసాయ పరికరాలు, ఎరువులు సబ్సిడీతో అందించాలన్నారు. నిరుపేద రైతులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా భగవంతు, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, ఉపాధ్యక్షులుగా చెన్నారెడ్డి, నర్సింహులు, బాలకృష్ణ, సహాయ కార్యదర్శులుగా బి.నారాయణ, కృష్ణయ్య, రాములు, పది మంది సభ్యులను ఎన్నుకున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గద్వాల క్రైం: పట్టణంలోని బీరోలు రోడ్డు మార్గంలో నివాసం ఉంటున్న భార్గవ్‌రెడ్డి ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు చొరబడి రూ.20 వేల నగదు అపహరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శనివారం పని నిమిత్తం ఇంటికి తాళం వేసి కర్నూల్‌కు వెళ్లారు. ఉదయం వచ్చి చూసేసరికి తాళం ధ్వంసం చేసి ఇంట్లోని వస్తువులు, బీరువాలోని నగదును ఎత్తుకెళ్లారన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పట్టణ రెండో ఎస్ఐ అబ్దుల్‌షుకుర్ తెలియజేశారు.

ఢిల్లీకి చిన్నోనిపల్లె భూ నిర్వాసిత రైతులు

- జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు ఐదుగ్రామాల నిర్వాసితులు
- ఏడాదిగా నమ్మె చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం



ఢిల్లీకి బయలుదేరిన చిన్నోనిపల్లె భూ నిర్వాసిత రైతులు

గట్టు: తెలంగాణకు ఏ మాత్రం ఉపయోగం లేని చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేయాలంటూ ఐదు గ్రామాలకు చెందిన భూ నిర్వాసిత రైతులు చేస్తున్న ఆందోళన ఢిల్లీలోనూ వినిపించనున్నారు. అక్కడి జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపట్టేందుకు జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని చిన్నోనిపల్లె, చాగదోన, లింగాపురం, బోయలగూడెం, ఇందువాసి గ్రామాల భూ నిర్వాసిత రైతులు ఆదివారం ఢిల్లీకి బయలు దేరారు. జిల్లాలోని నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా 101 ప్యాకేజీలో చిన్నోనిపల్లె గ్రామం దగ్గర నిర్మిస్తున్న చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేయాలంటూ ఏడాది కాలంగా ఐదు గ్రామాలకు చెందిన భూ నిర్వాసిత రైతులు ఆందోళన చేస్తున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఐదు గ్రామాలకు చెందిన భూ నిర్వాసిత రైతులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర ఆందోళన నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. 2006లో చిన్నోనిపల్లె గ్రామం దగ్గర 1.7 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రిజర్వాయర్ కోసం ఐదు గ్రామాలకు చెందిన రైతుల నుంచి 2464 ఎకరాలను సేకరించారు. అయితే కొంతకాలం పాటు పనులు కొనసాగించి తర్వాత పనులను నిలుపుదల చేశారు. ఏమాత్రం ఆయకట్టు లేకుండానే రిజర్వాయర్‌ను నిర్మిస్తుండడంతో భూ నిర్వాసిత రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వచ్చారు. ఏడాది క్రితం సీఎంఓ కార్యదర్శి స్మితాసబర్వాల్ చిన్నోనిపల్లెను సందర్శించి, రిజర్వాయర్‌ను పూర్తి చేయించి, ఆర్డీఎస్‌కు లింకు కలుపుతామని చెప్పడంతో నిర్వాసితులు పెద్దఎత్తున నిరసన తెలియజేశారు. అప్పటినుంచి సామూహిక ఆందోళలను ఇప్పటికీ కొనసాగిస్తూ వచ్చారు. బచావత్‌ట్రిబ్యునల్ ప్రకారం ఆర్డీఎస్‌కు తుంగభద్ర నది నుంచి 15.9 టీఎంసీల నీటి వాటాను దక్కించుకోవాల్సి ఉండగా, కృష్ణా నీటిని తుంగభద్ర పరివాహక ప్రాంతానికి ఎలా తరలిస్తారని చిన్నోనిపల్లె నిర్వాసిత రైతులు ప్రశ్నిస్తున్నారు. ఆర్డీఎస్ చివరి ఆయకట్టు వరకు నీరందించాలంటే కర్ణాటకలోని ఆర్డీఎస్ హెడ్‌రెగ్యులేటరీ నుంచి మనకు రావాల్సిన నీటి వాటాను కచ్చితంగా పొందాల్సి ఉందని, అది చేయకుండా అధికారులు చిన్నోనిపల్లె రిజర్వాయర్ నుంచి ఆర్డీఎస్‌కు లింకు కలపడం ద్వారా ఆర్డీఎస్ నుంచి మనకు రావాల్సిన వాటాను మనమే వదులుకున్నట్లు అవుతుందని భూ నిర్వాసిత రైతులు ప్రశ్నిస్తున్నారు. ఏ మాత్రం ఉపయోగం లేని చిన్నోనిపల్లె రిజర్వాయర్‌ను రద్దు చేయాలంటూ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, కేంద్ర జలశక్తి మంత్రికి, కృష్ణా రివర్ బోర్డును కలసి వినతిపత్రాలను అందజేయనున్నట్లు ఐదుగ్రామాల నిర్వాసిత రైతులు తెలిపారు.





క్లుప్తంగా...

నేడు, రేపు ఏపీ సీఎం వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటన

- 'ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'లో పాల్గొననున్న ఏపీ ముఖ్యమంత్రి



సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 30, 31 తేదీల్లో ఢిల్లీలో పర్యటించనున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 6.45 గంటలకు ఢిల్లీ చేరుకుని 1 జన్‌పథ్ నివాసంలో రాత్రికి బసచేస్తారు. మంగళవారం ఉదయం 10.30 నుంచి 5.30 గంటల వరకు ఢిల్లీ లీలా ప్యాలెస్ హోటల్లో దౌత్యవేత్తలతో జరగనున్న ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రౌండ్ టేబుల్ సమావేశం-కర్టెన్‌రైజర్ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం 6.05 గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరి రాత్రి 8.50 గంటలకు తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

తీరంలో అలజడి

- నేడు వాయుగుండంగా మారనున్న తీవ్ర అల్పపీడనం



సాక్షి, విశాఖపట్నం/వాకాడు (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా వాకాడు తీరంలో భీకర శబ్దాలతో అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతం, తూర్పు భూమధ్యరేఖ ప్రాంతం మీదుగా ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం మధ్య ట్రోపోస్ఫిరిక్ స్థాయి వరకు విస్తరించి ఉంది. తీవ్ర అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ సోమవారం నాటికి వాయుగుండంగా బలపడనుంది. అనంతరం నైరుతి బంగాళాఖాతం మీదుగా నెమ్మదిగా పయనిస్తూ ఫిబ్రవరి 1 నాటికి శ్రీలంక తీరానికి చేరుకుంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఆదివారం రాత్రి నివేదికలో తెలిపింది. దీని ప్రభావంతో సోమవారం నుంచి మూడు రోజుల పాటు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వివరించింది. కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో ఆదివారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్ర తీరంలో ఈదురు గాలులు వీస్తుండగా.. సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. దీంతో సముద్రం దాదాపు 5 మీటర్ల వరకు ముందుకు చొచ్చుకొచ్చి తీరాన్ని తాకుతోంది.

'గల్ఫ్' వలసలపై ఆరా!

బడ్జెట్‌కు ముందు సర్కారు కసరత్తు • వివరాలు సేకరిస్తున్న ఇంటెలిజెన్స్ విభాగం



మోర్తాడ్ (బాల్కొండ): గల్ఫ్ దేశాలకు కార్మికుల వలసలపై రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం వివరాలు సేకరిస్తోంది. 2018 నుంచి ఇప్పటివరకు ఏ సంవత్సరం ఎంతమంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారనే వివరాలపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను నిర్వహించనున్న తరుణంలో ఈ ప్రక్రియ చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు వలసలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి అధికంగా గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు. ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు హైదరాబాద్‌లోని కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో, పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల గెలుపు ఓటములపై గల్ఫ్ వలసలు ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నారు. వలస కార్మికుల సంక్షేమానికి ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేసింది. ఆయన మరణం తర్వాత గల్ఫ్ వలస కార్మికుల గురించి పట్టించుకున్నవారు లేరని విమర్శలు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమం సమయంలోనూ గల్ఫ్ వలస కార్మికుల అంశం ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. ఉద్యమంలో కార్మికుల కుటుంబాలు చురుగ్గా పాల్గొన్నాయి. అయితే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా గల్ఫ్ వలస కార్మికులకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కేరళ తరహాలో ప్రవాసీ విధానాన్ని మన రాష్ట్రంలో అమలు చేయాలని లేదా గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేయాలన్న డిమాండ్ మొదటి నుంచీ వినిపిస్తోంది. కాగా 2019 అక్టోబర్‌లో కూడా పంచాయతీ రాజ్ శాఖ ఇదే అంశంపై వివరాలను నమోదు చేసింది. కానీ అప్పట్లో ఆ ప్రక్రియ అర్థాంతరంగా ఆగిపోయింది. త్వరలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న తరుణంలో మరో సారి వలస కార్మికుల లెక్కల విషయంలో సర్కారు దృష్టి సారించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం వలస కార్మికుల వివరాలు సేకరిస్తున్న విషయం తమ దృష్టికి కూడా వచ్చిందని గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు మంద భీంరెడ్డి తెలిపారు. ప్రభుత్వం వద్ద కచ్చితమైన లెక్కలు ఉంటే వలస కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఉమ్మడి జిల్లాల వారీగా వలస కార్మికుల వివరాలు.. (వలస కార్మికుల సంఘాల అంచనాల ప్రకారం)

జిల్లా పేరు	వలస కార్మికుల సంఖ్య
హైదరాబాద్	4,50,000
కరీంనగర్	3,10,000
నిజామాబాద్	2,90,000
ఆదిలాబాద్	1,85,000
మెదక్	1,00,000
వరంగల్	80,000
మహబూబ్‌నగర్	30,000
నల్లగొండ	25,000
ఖమ్మం	20,000
రంగారెడ్డి	20,000
మొత్తం	15,10,000

వట్టి వసంతకుమార్ కన్నుమూత



భీమడోలు/ఆరిలోవ/ ఏయూ క్యాంపస్ (విశాఖ తూర్పు): ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వట్టి వసంతకుమార్ (70) ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఆయన 4 రోజుల క్రితం విశాఖపట్నంలోని అపోలో ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయనకు పిల్లలు లేరు. భార్య ఉమాదేవి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, పీహెచ్‌డీ చేసిన వట్టి వసంతకుమార్ అదే విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అనుచరుడు, సహచరుడిగా రాష్ట్ర రాజకీయాల్లో కీలక భూమిక పోషించారు. 2004, 2009 ఎన్నికల్లో ఉంగుటూరు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్లలో మంత్రిగా పనిచేశారు. వైఎస్సార్ మృతి తర్వాత పరిణామాలకు కలతచెందిన ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. కాగా వట్టి వసంతకుమార్ మృతి పట్ల ఏపీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు.

'రాజకీయ స్వార్థం కోసమే బీఆర్‌ఎస్'



సాక్షి, హైదరాబాద్: రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసమే బీఆర్‌ఎస్ పార్టీ పని చేస్తుంది తప్ప.. ప్రజా ప్రయోజనాల కోసం కాదని టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఆదివారం వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు టీడీపీలో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ చెప్పేదొకటి.. చేసేది ఒకటిగా ఉందని విమర్శించారు.





చెర్వుగట్టు ఆలయం వద్ద భక్తజన సందోహం. (ఇన్‌సెట్లో) కల్యాణతంతు జరిపిస్తున్న అర్చకులు →

కమనీయం.. రామలింగేశ్వరుడి కల్యాణం

- చెర్వుగట్టులో భక్తజన సందోహం

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారు జామున కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ప్రధాన ఆలయం నుంచి స్వామి అమ్మవారిని నంది వాహనంపై మంగళవాయిద్యాలు, భజనల మధ్య కల్యాణ మండపం వద్దకు తీసుకొచ్చారు. వేద పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్యశాస్త్రి, నీలకంఠశివాచార్య, ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సురేశ్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ వేదమంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ తంతు జరిపించారు. స్వామి వారికి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి నూతన పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కల్యాణోత్సవంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొన్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి దాదాపు లక్ష మంది భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు.

తెలంగాణ తరహా పాలన కావాలంటున్నారు

- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి
- మహారాష్ట్రలోని నాందేడ్‌లో బీఆర్‌ఎస్ సభ ఏర్పాట్ల పరిశీలన



నాందేడ్ జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

బోధన్/నిర్మల్: మహారాష్ట్ర ప్రజలు తెలంగాణ తరహా సంక్షేమ పాలన కావాలని కోరుతున్నారని రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 5న నిర్వహించే బీఆర్‌ఎస్ సభాస్థలిని ఆదివారం ఆయన పరిశీలించారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్, టీఎస్ఐడీసీ చైర్మన్ గ్యాదరి బాల మల్లు, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ఆయన వెంట ఉన్నారు. సభాస్థలంలో వేదిక, పార్కింగ్ ప్రదేశాలు, బారికేడ్ల ఏర్పాటు పనుల ప్రగతిని మంత్రి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలకు చెందిన రాజకీయ ప్రముఖులు బీఆర్‌ఎస్‌తో కలసి పనిచేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. నాందేడ్ సభలో సీఎం కేసీఆర్‌తో పాటు పలువురు జాతీయ నాయకులు పాల్గొంటారని తెలిపారు. తెలంగాణలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. నాందేడ్ సభలో కేసీఆర్ సమక్షంలో మహారాష్ట్రకు చెందిన పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరనున్నారని మంత్రి చెప్పారు. కాగా, నాందేడ్ జిల్లా కేంద్రంలోని గురుద్వారాను ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్నలతో పాటు బీబీ పాటిల్, బాల్క సుమన్, మహ్మద్ షకీల్, రవీందర్ సింగ్ దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వైభవంగా పాల ఉట్ల ఉత్సవం

- జాతరకు పోటెత్తిన భక్తులు



పాల ఉట్ల కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మక్తల్: మండలంలోని మాద్వార్ గట్టుతిమ్మప్పస్వామి (లక్ష్మీవేంకటేశ్వరస్వామి) ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పాల ఉట్ల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తుల కోలాటాలు, చిన్నారులు దాండీయ నత్యాలు, అడుగుల భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ముందుగా ఆలయంలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామానికి చెందిన యువకుడు క్షీరప్ప ఉట్టిని కొట్టగా.. ఆలయ చైర్మన్ రాజేశ్వర్‌రావు 5 తులాల వెండిని బహుమతిగా అందజేశారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఇందిర, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సంతోష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరుడిని దర్శించుకున్న విదేశీయులు



పూజల్లో పాల్గొన్న విదేశీయులు

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తరద్వారమైన ఉమామహేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం రష్యాకు చెందిన 50 మంది పర్యాటకులు దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చన, స్వామివారికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కందూరి సుధాకర్, ఈఓ శ్రీనివాసరావు వారికి ఘన స్వాగతం పలికి పూజల అనంతరం శాలువతో సత్కరించారు. కొండపై ఆహ్లాదకర వాతావరణంలో ఆలయం ఎంతో అద్భుతంగా ఉందని కొనియాడారు.

అలంపూర్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దుతాం

- రూ.4 కోట్లతో లేజర్ లైటింగ్
- సుమారు 200 మంది వీక్షించేలా స్టేజీ నిర్మాణం
- రాష్ట్ర పర్యాటకశాఖ ఎండీ మనోహర్



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎండీ మనోహర్

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ ఆలయాలను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని రాష్ట్ర పర్యాటకశాఖ ఎండీ మనోహర్ అన్నారు. ఆదివారం ఆయన టూరిజం డీఈ ధనరాజ్, టూరిజం హోటల్ మేనేజర్ శ్రీనివాసరాజు, ప్రసాద్‌స్కీం సైట్ ఇంజినీర్ రామకృష్ణతో కలిసి జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర, నవబ్రహ్మ ఆలయాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. నవబ్రహ్మ ఆలయాలకు లేజర్ లైటింగ్, సౌండ్ షో ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు చెన్నైలోని మల్టీ మీడియా నిపుణుల బృందాన్ని తీసుకొస్తామని.. వారికి ఆలయ అర్చకులు క్షేత్ర, స్థల ప్రశస్తి, పురాణం వివరించాలని కోరారు. ఇక్కడికి వచ్చిన భక్తులు రోజంతా గడిపేలా సౌకర్యాలు కల్పిస్తామని.. ఇందులో భాగంగా అధునాతన సదుపాయాలతో 25 గదులను నిర్మించనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా ప్రదోశకాల సమయంలో యాత్రికులు ఆహ్లాదంగా గడిపేందుకు ఆడిటోరియం, అందులో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు.

లైటింగ్‌షోకి రససిద్ధుల మఠం (మ్యూజియం) వేదిక..

భక్తులు లేజర్ లైటింగ్‌షోను వీక్షించేందుకుగాను ప్రస్తుత మ్యూజియం (రససిద్ధుల మఠం) వేదికగా బాగుంటుందని అభిప్రాయపడ్డారు. సుమారు 200 మంది కూర్చొనే సదుపాయం ఉందని.. పర్యాటకులు కిందపడకుండా రేలింగ్ ఏర్పాటు చేస్తామని, నవబ్రహ్మ ఆలయాలను ఒకేచోట కూర్చుని తిలకించే విధంగా మూవీంగ్ సీట్లు అమరుస్తామని తెలిపారు. వచ్చే ఆదాయంత మ్యూజియం కూడా అభివృద్ధి చెందుతుందని వివరించారు. రాష్ట్ర పురావస్తుశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో మాట్లాడి అనుమతులు తీసుకుంటామన్నారు.

పుష్కరఘాట్‌పై..

పుష్కరఘాట్‌పై షవర్లు, దుస్తులు మార్చుకునే గదులు, నదీహారతికి చక్కటి వేదిక ఏర్పాటు చేస్తామన్నారు. పుష్కరఘాట్ కింద ఉన్న మరుగుదొడ్లను తొలగించి మరోచోట నిర్మిస్తామని తెలిపారు. ఇక నదిలో నీటిమట్టాన్ని పరిశీలించి శ్రీశైలం క్షేత్రానికి బోటింగ్ సౌకర్యం గురించి పరిశీలిస్తున్నట్లు వివరించారు. పార్కింగ్ ప్రాంతంలో పచ్చదనంతో పాటు అందమైన రిమూవబుల్ టైల్స్ ఏర్పాటు చేయిస్తామన్నారు. వీరి వెంట ఆలయ సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్, ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ ఉన్నారు.

భక్తులను ఆకట్టుకునేలా..

ఇటీవల గ్రీస్ దేశాన్ని సందర్శించి అక్కడి ప్రదేశాలు కట్టడాలు చూశాం. ఇక్కడ కూడా అలాంటి వాతావరణం తీసుకొచ్చేందుకు ఆలయాలను, కట్టడాలు తీర్చిదిద్దుతాం. దీంతో ఆర్థిక వనరులు పెరగడంతో పాటు చిరు వ్యాపారులకు ఉపాధి లభిస్తుంది.

– మనోహర్, ఎండీ, పర్యాటకశాఖ

ఘనంగా లక్ష్మీచెన్నకేశవస్వామి శకటోత్సవం



రాజగోపురం మెట్లపైకి ఎద్దులబండి ఎక్కిస్తున్న భక్తుడు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శకటోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు ఎద్దులబండ్లు, ట్రాక్టర్లను అందంగా అలంకరించి గ్రామవీధుల్లో తిప్పారు. శకటోత్సవంలో పోతురాజుల విన్యాసాలు, సంప్రదాయ నృత్యా లు ఆకర్షణగా నిలిచాయి. ఆలయం మెట్లు ఎక్కించేందుకు ఎద్దులబండ్లు, ట్రాక్టర్లు పోటీ పడ్డాయి. ఆలయ రాజగోపురం వద్ద 5 నుంచి 6 మెట్లు ఎక్కించి గుమ్మడికాయ, కొబ్బరికాయలు కొట్టి వెనక్కి తిరిగారు. శకటోత్సవాన్ని తిలకించేందుకు జనం రథం, ఇళ్ల మిద్దెలపైకి ఎక్కారు. భక్తులు అధికసంఖ్యలో తరలిరావటంతో ఆలయ ఆవరణలో భక్తుల కోలాహలం కనిపించింది. చాలామంది భక్తులు వంటలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం చక్రతీర్థం, పూర్ణాహుతితో ఉత్సవాలు ముగియనున్నాయి.

ఆకట్టుకున్న ఒగ్గు కళాకారుల ప్రదర్శన..

శకటోత్సవంలో కొడంగల్ ఒగ్గు కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఒక్కొక్కరుగా, పిరమిడ్ ఆకారంలో, బృందంగా చేసిన డప్పు వాయిద్యాలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొన్నేళ్లుగా శకటోత్సవంలో ప్రదర్శనలిస్తున్నామని ఒగ్గు కళాకారుల బృందం తెలిపింది.

గొర్రె పొటేళ్ల శకటం..

శకటోత్సవంలో గ్రామ యాదవసంఘం ఆధ్వర్యంలో గొర్రెపొటేళ్ల శకటం భక్తులను ఆకట్టుకుంది. పొటేళ్లు లాగేందుకు అనుకూలంగా చిన్న శకటాన్ని తయారు చేసి ఉత్సవాల్లో ప్రదర్శించారు.

- బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ ఆదివారం ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు స్వాగతం పలికి దర్శనం అనంతరం ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందించారు. లక్ష్మీచెన్నకేశవుడి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలకు ఉండాలని ఆకాంక్షించారు.

అశ్వవాహనసేవలో పాలెం వెంకన్న

బిజినేపల్లి: పాలెం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారికి అశ్వవాహనసేవ నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి ప్రత్యేక పూజల అనంతరం అశ్వవాహనంపై ఉంచి ఊరేగించారు. అలాగే ఉదయం నుంచి నిత్యారాధన, ప్రబంధ పారాయణం, హోమం, బలిహరణం తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తిగీతాల పోటీలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉద్దాల ఉత్సవం, రాత్రి హోమం, బలిహరణం, అశ్వవాహనసేవ, స్వామి వారికి ప్రసాద నివేదన కార్యక్రమంతో పూర్తి చేశారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



అశ్వవాహన సేవలో వెంకన్నస్వామి

కురువలను ఎస్సీ జాబితాలో చేర్చాలి

హిందూపూర్ ఎంపీ గోరంట్ల మాధవ్



ఎంపీ గోరంట్ల మాధవ్‌ను సత్కరిస్తున్న కురువ సంఘం నాయకులు

అయిజ: మాదాసి కురవ, మాదారి కురువలను ఎస్సీ జాబితాలో చేర్చాలని హిందూపూర్ ఎంపీ గోరంట్ల మాధవ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో మాదాసి కురవ, మాదారి కురువలను పాలకులు అర్థం చేసుకోవాలన్నారు. మాదాసి కురవ, మాదారి కురవ కులం గతంలో నాగరికతకు దూరంగా ఉందని, వివక్షకు గురైందని అన్నారు. ఎస్సీలలో కూడా కిందిస్థానంలో ఉన్న కులం ఏదైనా ఉందంటే అది మాదాసికురువ, మాదారి కులాలని, ఇక్కడి పాలకులు అర్థం చేసుకోవాలన్నారు. కొందరి పరిపాలకుల దుశ్చర్యవల్ల కురువ కులం ఏ జాబితాలో ఉందో కూడా కనబడడం లేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు ఎస్సీ సరిఫికెట్లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కురువ కులమంతా ఏకతాటిపైకి వస్తుందని అన్నారు. రాజకీయంలో కూడా ప్రాధానం ఇవ్వాలని, ఆత్మగౌరవంతో బతికే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా కురువ సంఘం నాయకులు గోరంట్ల మాధవ్‌ను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సంకాపురం రాముడు, వెంకట్రాముడు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని తొత్తినోనిదొడ్డిలో గుండ్ల బీమరాయుడి జాతర ఉత్సవాల్లో గోరంట్ల మాధవ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉపాధ్యాయుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు 90రోజుల చైల్డ్ కేర్ లీవ్, సకల జనుల సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులకు ఒక్క రూపాయి నష్టపోకుండా జీఓ తీసుకురావడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వచ్చే ఎన్నికల్లో సంపూర్ణ సహకారం ఉండాలని కోరారు.

ఉర్దూ టీచర్ల నియామకం చేపట్టాలి

తెలంగాణ ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారుఖ్ హుస్సేన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ గురుకులాల పేరుతో ఉర్దూ మీడియం పాఠశాల, కళాశాలను ఎత్తివేయడం సరికాదన్నారు. ఎన్నికల ప్రణాళికలో చేసిన వాగ్దానం మేరకు వెంటనే ప్రతి పాఠశాలలో ఉర్దూ టీచర్ నియామకం చేపట్టాలని కోరారు. వచ్చే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న కాటేపల్లి జనార్దన్‌రెడ్డికి తెలంగాణ ఆల్‌మేవా పక్షాన పూర్తిగా మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. ఆయన విజయానికి ఆల్‌మేవా శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఆల్‌మేవా రాష్ట్ర ఉపాధ్యక్షులు వహీద్‌షా, కోశాధికారి ఎండీ రషీద్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ ఇషత్‌అలీ, మహ్మద్ అయూబ్, అసోసియేట్ అధ్యక్షులు మహ్మద్ ఆరిఫ్, కోశాధికారి ఖాజా జైనుల్ అబెదిన్, నాయకులు హబీబ్ అబ్దుర్ రహెమాన్, ఏబీ మహ్మద్,ఖాజా నిజాముద్దీన్, సిరాజ్‌ఖాన్ ఉన్నారు.

విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలి



మాట్లాడుతున్న పి.రామకృష్ణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. జిల్లా పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణత్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యత కల్పించి పేదలు చదువుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. చాలీచాలని నిధులతో విద్యారంగం ఇబ్బందులకు గురవుతుందన్నారు. విద్యారంగాన్ని పటిష్ఠం చేసేందుకు రాబోయే బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయిస్తే పేదలకు ఉచిత విద్య అందుతుందని అన్నారు. 2022–23లో విద్యారంగానికి కేవలం 6.38 శాతం నిధులు కేటాయించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పాలమూరు యూనివర్సిటీకి రూ.100 కోట్లు కేటాయించి ఉన్నత విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి, ప్రధాన కార్యదర్శి సీతారాం, కోశాధికారి సంజీవ్ పాల్గొన్నారు.